# ప్రత్యక్ష సాక్షి

తెలుగు దినపత్రిక

RNI No.APTEL/2011/38267

సంపుటి : 16 సంచిక : 018 గురువారం 23-07-2026

ఎడిటర్ : కందుకూరి పరమేశ్వర్‌రావు, M.A. పేజీలు : 4 వెల : రూ2/-



## విలేకరులు కావలెను

ప్రత్యక్ష సాక్షి దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాలు మరియు నియోజకవర్గాల నుంచి పనిచేయుటకు విలేకరులు కావలెను. ప్రశ్నించే తత్వంతో పాటు నిజాన్ని నిర్భయంగా రాయగలిగే సత్తా ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి : సెల్ : 99892 88546


## కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ యువత భవిష్యత్తును అంధకారం చేస్తోంది : డిప్యూటీ సీఎం భట్టి





**సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్**

ఏఐసీసీ మరియు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు బుధవారం హనుమకొండ డీసీసీ భవన్ వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహన కార్య క్రమం నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరియు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, దేశవ్యాప్తంగా కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ను నాశనం చేసిన 'నీట్' పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహి స్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ భారీ నిరసన చేపట్టారు. డీసీసీ భవన్ వద్ద దిష్టిబొమ్మ దహనం అనంతరం, నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి అంబేద్కర్ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.

ఈ నిరసన కార్యక్రమంలో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖా పాల్గొని కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వీరితో పాటు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె. ఆర్. నాగ రాజు, టిపిసిసి మెంబర్లు కూచన రవళి,ఇవి శ్రీనివాస్ రావు, భట్టి శ్రీనివాస్ రావు, గ్రంధాలయ ఛైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ మేయర్ గుండు సుధారాణి, ఏనుమముల మార్కెట్ ఛైర్మన్ పులి ప్రియాంక , కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ పింగిలి వెంకట్రామ్ నర్సింహా రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాసీర్ అహ్మద్, జిల్లా కమిటీ సభ్యు లు, డివిజన్, మండల అధ్యక్షు లు, హనుమకొండ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, పాల్గొ న్నారు. భట్టి విక్రమార్క మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, అప్రజాస్వామి క విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో సామాన్యుల తరఫున, విద్యార్థుల తరఫున ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరియు ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టులు చేయించడం బీజేపీ అహంకారానికి పరాకాష్ట అని ఆయన మండిపడ్డారు..

మోదీ ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా కాంగ్రెస్ పార్టీ భయపడదని, ప్రజల తరఫున పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కోట్ల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న 'నీట్' పరీక్ష పేపర్ లీకేజీ కావడం ఈ కేంద్ర ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని, ప్రతిభావంతు లైన పేద విద్యార్థులకు అన్యాయం చేస్తూ పేపర్లు అమ్ముకుంటున్న విద్యా మాఫియాకు ఈ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని విమర్శిం చారు. విద్యావ్య వస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని, నీట్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిలకడ లేని, అవినీతిమయమైన నేషనల్... టెస్టింగ్ ఏజెన్సీ ని కేంద్రం తక్షణమే రద్దు చేసి, పారదర్శక మైన పరీక్షా విధానాన్ని తీసుకు రావాలని, నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వా నికి రోజులు దగ్గర పడ్డాయని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

## జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై పార్లమెంట్ ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్**

తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై వరంగల్ పార్లమెంట్ సభ్యురా లు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్లో ప్రశ్నించారు. జిల్లాలో ఎంత మంది లబ్ధిదా రులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారో, అలాగే ఆహార ధాన్యాల కేటాయింపు మరియు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ఎంపీ డా.కడియం కావ్య వివరాలు కోరారు.ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమా ధానంగా కేంద్ర వినియోగదా రుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతీభాయ్ బంభానియా లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో 4,51,376 మంది లబ్ధిదారులు జాతీయ ఆహార భద్రత చట్టం కింద ఉచిత ఆహార ధాన్యాలు పొందుతు న్నట్లు వెల్లడించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు గుర్తించిన లబ్ధిదారుల ఆధారంగా కేంద్రం నిర్దేశించిన పరిమితుల మేరకు ఆహార ధాన్యాల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కింద ప్రతి కుటుంబా నికి నెలకు 35 కిలోల ఆహార ధాన్యాలు, ప్రాధాన్య కుటుంబాల (పీహెచ్‌హెచ్) కింద ప్రతి వ్యక్తికి నెలకు 5 కిలోల చొప్పున ఆహార ధాన్యాలు అందిస్తున్నట్లు వివరించారు.ప్రజల సంక్షేమం, పేద కుటుంబాల ఆహార భద్రత అంశాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందాలనేదే తన లక్ష్యం అన్నారు. ఆహార ధాన్యాల కేటాయింపులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, భవిష్యత్తులో లబ్ధిదారుల సంఖ్య పెరిగితే తగిన విధంగా కేటాయింపులు పెంచేలా చర్యలు తీసుకోవా లని కేంద్రాన్ని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు.

## నల్ల బ్యాడ్జీలతో కాంగ్రెస్ నాయకుల నిరసన..

**డి ఆర్ స్వామి ప్రత్యక్ష సాక్షి రామకృష్ణాపూర్**

నీట్ పేపర్ లీకేజీ, ప్రతిపక్ష ఎంపీల అరెస్టులను నిరసిస్తూ రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు రఘునాథ రెడ్డి పట్టణ అధ్యక్షులు వి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, నీట్ పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంగా విఫలమైందని కేంద్ర ప్రభుత్వం పై తీవ్రంగా విమర్శించారు. నీట్ పేపర్ లీకేజ్, పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి, అలాగే పార్లమెంట్లో ఈ అంశంపై చర్చ కోరిన ప్రతిపక్ష ఎంపీలను అడ్డుకోవడం, ఏమిటని ప్రశ్నించారు కష్టపడి చదివే విద్యార్థులకు న్యాయం జరగకపోవడం దురదృష్టకరమని అన్నారు. పార్లమెంట్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష ఎంపీలు విద్యార్థుల తరఫున నీట్ పేపర్ లీకేజ్ అంశంపై చర్చ జరపాలని మాత్రమే డిమాండ్ చేశారని, అయితే కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పకపోవడం సిగ్గుచేటని ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ధోరణితో



కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు అండగా నిలుస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్ భీమ మల్లేష్ కూతురు ప్రభాకర్ మాజీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు మాజీ జెడ్పిటిసి యాకుబ్ అలీ పనస రాజు విద్యాసాగర్ రెడ్డి అధికార ప్రతినిధి సుధాకర్ పుల్లూరి కళ్యాణ్ కట్కూరి శ్రీనివాస్ రెడ్డి గోపు రాజం మేకల సురేందర్ వేల్పుల సత్యనారాయణ ఎర్రబెల్లి రాజేష్ పైడాకుల శ్రీనివాస్ నర్రా శ్రీనివాస్ రాపాక రాజు శ్రీనివాస రావు వనం యాదగిరి పోగుల లచ్చులు కనుకయ్య లింగయ్య తదితరులు పాల్గొన్నారు





## నీట్ యూజీ పేపర్ లింక్‌తో మోడీ ప్రభుత్వానికి మూడింది

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**కుమారస్వామి ప్రత్యక్ష సాక్షి స్టాఫ్ రిపోర్టర్ జగిత్యాల**

ప్రతి ఏటా నిర్వహించే నీట్ యూజీ పరీక్ష పత్రం లీకేజీతో కేంద్రంలో ని మోడీ ప్రభుత్వానికి మూడిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దేశ వ్యాప్తంగా ప్రతి యేటా నిర్వహించే నిట్ పరీక్ష కు సుమారుగా20 లక్షలకు పైగా మందికి పైగా విద్యార్థులు హాజరు అవుతారని పేర్కొ న్నారు. ఈపరీక్షను ఎంతో జాగ్రత్తగా నిర్వహించాల్సిన బాధ్యత కేంద్రం ప్రభుత్వంపై ఉ ఒదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరీక్షను పారదర్శకంగా నిర్వహించా నికి ఏలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పరీక్ష ప్రశ్న పత్రాలు పల్లి, బఠాణీ అమ్మినట్లు ప్రశ్న పత్రాలను అమ్ముకున్నారని మంత్రి అడ్లూరి ఆరోపించారు. నీట్ యూజీ ప్రశ్నపత్రాల రూపకల్పన, అనువాద ప్రక్రియ, పరీక్షా ప్యానెల్‌లోని సబ్జెక్ట్ నిపుణులు,కోచింగ్ నిర్వాహకులు ఈ లీకేజీలో కీలక పాత్ర పోషించినట్లు బీజేపీ జేబు సంస్థగా చెప్పు కునే సీబీఐ దర్యాప్తులో తేల్చిందని వివరించారు. ఢిల్లీ, జైపూర్, పుణే, లాతూర్, గురుగ్రామ్ తది తర ప్రాంతాల్లో లెక్చరర్లు, కోచింగ్ సెంటర్ల నిర్వాహ కులు, దళారులను సీబీఐ అరెస్ట్ చేసింది నిజం కదా అని మంత్రి ప్రశ్నించారు. సీబీఐ దర్యాప్తులో పరీక్ష పత్రం లీక్ అయినట్లు తెలిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. గడిచిన రెండు రోజులుగా పార్లమెంట్ ను వాయిదా వేశారు తప్ప కేంద్ర ప్రభుత్వం చర్చకు మాత్రం అంగీకరించడం లేదని అన్నారు..

కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు ఆధారాలు చూపించి అరెస్టులు చేసిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయడం లేదని ఆయన అన్నారు. ఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు చేసిన ధర్నా సందర్భంగా ఢిల్లీ పోలీసులు కేంద్ర ప్రభుత్వం లాఠీ చార్జి చేయడానికి బాధ్యత వహిస్తూ ప్రధానం ప్రధానమంత్రి మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్య క్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ ఛైర్ పర్సన్ సమీండ్ల వాణి , జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ దినేశ్, బండ శంకర్,నారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

## నెరవేరిన పరిటాల రవీంద్రుని కల

### అట్టహాసంగా నసనకోట ఎంజెపి గురుకుల బాలికల కళాశాల ప్రారంభం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

### జగన్ రెడ్డి రంగుల రెడ్డిగా మారి విద్య, బిసి సంక్షేమ శాఖలను నిర్వీర్యం చేశారన్న సవిత



**(మంద గంగాధర ప్రత్యేక్షసాక్షి బ్యూరో అనంతపురం)**

రామగిరి ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం... మాజీ మంత్రి పరిటాల రవీంద్రుని కల అయిన నసనకోట ఎంజెపి గురుకుల బాలికల జూనియర్ కళాశాల ప్రారంభమైంది. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఈ కళాశాలను ప్రారంభించారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ఎంజేపీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి మంత్రి కి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో సరస్వతి అమ్మవారు, విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ సిబ్బందితో మాట్లాడుతూ పిల్లలతో ఆత్మీయంగా ఫోటోలు తీయించుకున్నారు. పాఠశాలలోని హైస్కూల్ మరియు జూనియర్ కళాశాలకు చెందిన 680 మంది విద్యార్థినులకు స్పోర్ట్స్ మెటీరియల్, యూనిఫాం, ట్రాక్స్ షూస్ తో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. స్థానికులు పేరూరు ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలకు కూడా జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని కోరారు. ఆత్మకూరు మండల కేంద్రంలో బీసీ గురుకుల పాఠశాలను నిర్మించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు దీనిపై మంత్రి సవిత సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ వెనుకబడిన రామగిరి ప్రాంతంలో చాలామంది పిల్లలకు సరైన విద్యా సౌకర్యాలు లేక నిరక్షరాస్యులుగా ఉన్న పరిస్థితిని ఆ రోజుల్లో పరిటాల రవి గమనించారన్నారు. అందుకే ఈ ప్రాంతంలో గురుకుల పాఠశాలలను తీసుకురావాలని ఆయన తపించారన్నారు.

పేరూరులో బాలుర గురుకుల పాఠశాల ఏర్పాటు చేయించారన్నారు. ఆ తర్వాత నసనకోట ప్రాంతంలో బాలికల కోసం గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారన్నారు. అయితే అనుకోకుండా పరిటాల రవి మరణం తర్వాత అది మరుగున పడిందన్నారు. పరిటాల రవి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో మరోసారి ఆ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఇక్కడ ఎంజెపి గురుకుల పాఠశాల మంజూరు చేయించారన్నారు. ఇక్కడ పది ఎకరాల స్థలాన్ని కూడా కొనుగోలు చేశామని అన్నారు. ఈరోజు ఇది రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఇదే పాఠశాలలో 10వ తరగతి తర్వాత చాలామంది విద్యార్థులు చదువు మానేస్తున్నారన్న విషయాన్ని గమనించామన్నారు. ఇక్కడే బాలికల జూనియర్ కళాశాల ఉంటే ఇంటర్మీడియట్ వరకు చదువుకునే అవకాశం ఉంటుందని.. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. గత ఆగస్టు 15లోగానే ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాల్సి ఉండేదని.. అయితే కొన్ని కారణాలవల్ల అది జాప్యం జరిగిందన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కృషి వలన జూనియర్ కళాశాల మంజూరైందన్నారు. వారికి ఎప్పటికీ ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని ఎమ్మెల్యే సునీత అన్నారు. దీంతో పాటు మరికొన్ని కళాశాలలు పాఠశాలలు నిర్మించాల్సి ఉందని మంత్రి సవితకు విజ్ఞప్తి చేశారు.

మరోవైపు మంత్రి సవిత మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత అంటే ధైర్యం, పోరాటం, మంచితనం, రాజకీయం అని కొనియాడారు. ఎమ్మెల్యే సునీత కృషి వలనే ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటు అయిందని వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం రామగిరిలో బాలికల గురుకుల కళాశాల ఏర్పాటు చేశామన్నారు. గత ఐదేళ్లలో జగన్ రెడ్డి రంగుల రెడ్డి గా మారి విద్యాశాఖను బీసీ సంక్షేమ శాఖను అస్తవ్యస్తం చేశారని విమర్శలు చేశారు. చివరికి పిల్లల డైట్ చార్జీలు కూడా పెండింగ్ లో పెట్టి పోయారన్నారు. ఎక్కడికక్కడ పాఠశాల, వసతి గృహాల భవనాలు పెండింగ్ లో పెట్టి పోయారన్నారు. కూటమి వచ్చాక రాయలసీమలో ఐదు, ఉత్తరాంధ్రలో ఐదు గురుకుల కళాశాలలు మంజూరు చేశామని.. త్వరలో పులివెందులలో కూడా గురుకుల పాఠశాల ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. ఓవైపు బీసీ సంక్షేమ శాఖ తరపున పెండింగ్లో ఉన్న భవనాలన్నీ పూర్తి చేస్తున్నామని, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవ వల్ల ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం కింద 15 వేల రూపాయలు ఆర్థిక సాయం అందుతోందన్నారు. రాష్ట్రంలో 67 లక్షల మందికి 10వేల 120 కోట్ల రూపాయలు అందజేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇంత మంచి చేస్తున్నప్పుడు వారు క్రమశిక్షణగా చదువుకొని ఉన్నత శిఖరాలకు వెళ్లాలని సూచించారు. అనంతరం వెంకటాపురంలో పరిటాల రవీంద్ర ఘాట్ ను సందర్శించి నివాళులు అర్పించడం జరిగింది..

# బ్రిటీష్ పాలకులకు సింహ స్వప్నం చంద్రశేఖర ఆజాద్

## జూలై 23.. ఆజాద్ జయంతి



భారత స్వాతంత్ర ఉద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆజాద్ గర్వించదగ్గ అసహాయ శూరుడు, అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. ఆయన "పండిత్‌జీ"గా కూడా పిలువ బడ్డాడు. 1857 తరువాత సాయుధ పోరాటం చేసిన వీరుల్లో మొట్టమొదటి వాడు, దేశ ప్రజల రక్షణ కోసం ధర్మ యుద్ధమే సరైనది గట్టిగా నమ్మినవాడు ఆజాద్. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బాభ్రా గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించాడు. ప్రాథమిక విద్యను సొంత గ్రామం లోనే పూర్తి చేసి, తర్వాత వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించాడు. ఆయన చిన్నప్పటి నుంచి హనుమాన్ భక్తుడిగా ఉండేవాడు.

1919 లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలత చెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యాడు. విచారణ సందర్భంగా కోర్టులో ఆయనను విచారిస్తున్న బ్రిటిష్ న్యాయాధికారి ఖరేఘాట్‌కు ఆ బాలుడిచ్చిన సమాధానంతో మతి పోయింది. వాస్తవానికి తన పేరు 'ఆజాద్' అని, తన తండ్రి పేరును 'స్వతంత్రం', తన నివాసం 'జైలు' అని చెప్పాడు. "మతిపోయిన ఆ న్యాయాధికారి చిదిమితే పాలుగారే ముఖారవిందుడైన ఆ బాలుడిని చూస్తూ కూడా అధికార దర్పంతో '15 కొరడాల దెబ్బల' శిక్ష ప్రకటించాడు. నరరూప రాక్షసులు కొరడా ఝుళిపిస్తూ ఒక్కొక్క దెబ్బ కొడుతుంటే.. ఆ బాలుని శరీరమంతా రక్తసిక్తమై పోయింది. అయినా ఆ బాలుడు దెబ్బ పడినపుడు వందేమాతరం, భారత్‌మాతాకీ జై అంటున్నాడు. ఈ ధైర్యం చాలా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ రోజు నుండి ఆయన పేరు 'చంద్ర శేఖర్ ఆజాద్' గా మారింది.

"సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవ వాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారత దేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందే నని ఆయన బలంగా నిశ్చయించు కున్నాడు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించాడు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గ నిర్దేశకుడిగా మారి పోయాడు. ఆజాద్... 1926లో కకోరీ ట్రైన్ దోపిడీ, అదే సంవత్సరంలో వైశ్రాయి రైలును కాల్చి వేయడం, లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగతీర్చు కోవడానికి 1928వ సంవత్సరంలో లాహోర్‌లో జె.పి. సాండర్స్‌ను కాల్చి వేయడం తదితర హింసాత్మక కార్యక్రమాల్లో పాలు పంచు కున్నాడు. ఒకానొక దశలో ఆజాద్ బ్రిటీష్ పోలీసులకు సింహస్వప్నంలా నిలిచారు. పోలీసుల హిట్‌లిస్ట్‌ను తయారు చేసుకున్న ఆయన వారిని చంపేదాకా వదిలి పెట్టలేదు. పదిహేనేళ్ల ప్రాయంలో అరెస్టయిన తరువాత బయటికి వచ్చి పోరాటంలో పాలు పంచుకున్న ఆజాద్... ఆ తరువాత తన మరణం దాకా కూడా ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కలేదు.

1931, ఫిబ్రవరి 27వ తేదీన తన ఇద్దరు సహచరులను కలిసేందుకు అలహాబాదు లోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టు ముట్టారు. ఆజాద్‌ను లొంగి పోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు ఎదురు తిరిగాడు. వెంబడిస్తున్న పోలీసుల్లో ముగ్గురిని కాల్చి చంపాడు. ఐనా తరుముతూ వస్తున్న పోలీసులకు చిక్కే పరిస్థితి వచ్చింది. ఇక తుపాకీలో ఒకే ఒక్క బుల్లెట్ వుంది. దానితో వాళ్లను మట్టుబెట్ట లేనని తెలుసుకుని, బ్రిటిష్ వారి చేతిలో చనిపోవడం కంటే తనకు తానే ఆత్మత్యాగం చేసుకోవాలను కున్నాడు. వెంటనే తుపాకీని తన తలకు గురిపెట్టి కాల్చుకుని అమరడయ్యాడు. "నీలో ఉన్నది ఉప్పునీరా? అయితే నీకోసమే బతుకు. కాదూ ఉడుకు రక్తమంటావా? అయితే దేశం కోసం మరణించు. నీ దేహం నిప్పుకణాల కొలిమి అయితే అనుక్షణం నీ ప్రాణాన్ని సంఘానికి సమర్పించు. నీ గుండెకాయ పత్తికాయ అయితే భరత మాతను మరిచిపోయి నీ సుఖమే చూసుకో" – ఇలా రోమాలు నిక్కబొడుచుకునేలా పలికిన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్.

బతికుండగా బ్రిటీష్ వారు నన్ను పట్టుకోలేరు. వాళ్ళకు అంత దమ్ము లేదు. అని పదే పదే ఆజాద్ అంటుండే వాడు. "నా చావు నా చేతుల్లోనే ఉంది, శత్రువుల చేతుల్లో చావను" అంటూ చిన్ననాడు చేసిన శపథం నిజంచేస్తూ, పోలీసులకు చిక్కక, పిస్తోలుతో పేల్చుకుని స్వతంత్ర జీవిగా అస్తమించాడు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ స్వాతంత్ర చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువతకు ఒక మహోజ్వల ప్రేరణ, అసమాన ఉదాహరణ.

చివరిదాకా ఆజాద్‌ను ప్రాణాలతో పట్టుకోవాలని భావించిన బ్రిటీష్ పోలీసులు సాధ్యంకాక... ఆయన మృత దేహాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది. ఆజాద్ ఆత్మత్యాగం ప్రజల్లో మరింత పట్టుదలను పెంచి, దేశభక్తిని రగిల్చింది. పోరాట పథం పట్టేలా ప్రోత్సహించింది. ఆజాద్ మరణించిన అలహాబాదు లోని ప్రయాగ్‌రాజ్ పార్కుకు చంద్రశేఖర్ ఆజాద్ పార్కుగా నామకరణం చేయ బడింది. మరణించే సమయంలో 'ఆజాద్' వద్ద ఉన్న పిస్టల్ అలహాబాద్ మ్యూజియంలో ప్రదర్శించ బడింది. 1988లో భారత ప్రభుత్వం చంద్రశేఖర్ ఆజాద్ ముఖచిత్రంతో తపాలా బిళ్ళను విడుదల చేసింది. 1965లో షహీద్ సినిమాతో ప్రారంభించి పలు భాషలలో ఎన్నో సినిమాలు నిర్మించ బడ్డాయి. 2018లో టెలివిజన్ సీరీస్ తీయబడింది. చంద్రశేఖర్ ఆజాద్ జన్మించిన మధ్య ప్రదేశ్‌లోని భభ్రా (భవ్రా) గ్రామం చంద్రశేఖర్ ఆజాద్ నగర్‌గా పిలవడం జరుగుతోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494**

# జాతీయ పతాకం మన స్వేచ్ఛ, ఐక్యతలకు ప్రతిరూపం..

**కుమారస్వామి ప్రత్యక్ష సాక్షి స్టాఫ్ రిపోర్టర్ జగిత్యాల**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మోడల్ స్కూల్ ఆవరణలో 'భారత జాతీయ పతాక స్వీకార దినోత్సవాన్ని' పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి చెరుకు రాజన్న హాజరుకాగా, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, లయన్స్ క్లబ్ బాధ్యులు ఎంఈఓ చెరుకు రాజన్నను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ చెరుకు రాజన్న మాట్లాడుతూ.."జాతీయ పతాకం మన స్వేచ్ఛకు, ఐక్యతకు సజీవ ప్రతిరూపం. 1947 జూలై 22న రాజ్యాంగ పరిషత్ త్రివర్ణ పతాకాన్ని అధికారికంగా ఆమోదించిన ఈ రోజు భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. మన తెలుగు నేల ముద్దుబిడ్డ శ్రీ పింగళి వెంకయ్య గారు ఎంతో అధ్యయనం చేసి ఈ జెండాను రూపకల్పన చేయడం మనందరికీ గర్వకారణం. విద్యార్థులు చిన్నతనం నుంచే పింగళి వెంకయ్య గారి లాంటి మహనీయుల కృషిని స్ఫూర్తిగా తీసుకుని, దేశభక్తిని మరియు క్రమశిక్షణను అలవర్చుకోవాలి." అని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మన కుమార్ మాట్లాడుతూ..."పాఠశాల స్థాయిలో ఇలాంటి జాతీయ దినోత్సవాలను నిర్వహించడం ద్వారా విద్యార్థులలో దేశభక్తితో పాటు నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. త్రివర్ణ పతాకంలోని కాషాయ రంగు త్యాగానికి, తెలుపు శాంతికి, ఆకుపచ్చ సమృద్ధికి మరియు అశోక చక్రం ధర్మానికి సంకేతాలుగా నిలుస్తాయి. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భావి భారత రథసారథులుగా ఎదగడమే జాతీయ జెండాకు




ఇచ్చే నిజమైన గౌరవం." అని ఆకాంక్షించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం:

ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు 'జాతీయ పతాక విశిష్టత – పింగళి వెంకయ్య గారి పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు, నిర్వహించారు. భారత సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు,పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు లయన్స్ క్లబ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సుంకరి రవి, లయన్స్ క్లబ్ కోశాధికారి సట్టా సురేష్, ప్రోగ్రామింగ్ చైర్మన్ (మాజీ ఎంపిటిసి) భీమసత్యం, పాస్ట్ ప్రెసిడెంట్ ముసుకు కరుణాకర్ రెడ్డి, కార్యదర్శి నరహరి, లీడ్ ఇండియా ఫౌండేషన్ మేనేజర్ తాడూరి శ్రీనివాస ఆచార్య పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా విద్యార్థుల "జై హింద్", "భారత్ మాతాకీ జై" నినాదాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది.

# మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూంలు తెరిపించాలి..

**గూడ రమేష్, ప్రత్యక్ష సాక్షి, ఇబ్రహీంపట్నం**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో గల మూడు లైసెన్స్ మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూంలను వెంటనే తెరిపించాలని పలువురు కోరారు.

మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూంలు లేకపోవడంతో మందు బాబులు రోడ్ల పక్కన, బస్టాండ్ వద్ద, కూడళ్ల వద్ద బహిరంగంగా మద్యం సేవించడంతో అటు వైపు వెళ్ళే మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే లైసెన్స్ మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూంలను తెరిపించాలని కోరుతున్నారు.

# విజయ రమణారావుకు క్యాబినెట్ మంత్రి హోదాపై సంబరాలు..

**ప్రత్యక్ష సాక్షి , సుల్తానాబాద్**

ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ మంత్రి హోదా కల్పించడం పై సుల్తానాబాద్ లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు,బుధవారం చింతకుంటరమణారావు ను సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ, మాజీ జెడ్పిటిసి డాక్టర్ అయిల రమేష్ , మాజీ మార్కెట్ చైర్మన్ సాయి మహేందర్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల రవీందర్, కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న), వేగోళం అబ్బయ్య , అల్లంకి శ్రీనివాస్, కుమార్ కిషోర్, పెగడ పరశు రాములు తో పాటు పలువురు కలసి పుష్పగుచ్చం అందజేసి,శాలువా కప్పి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.



# రీ-సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత



**కుమారస్వామి ప్రత్యక్ష సాక్షి స్టాఫ్ రిపోర్టర్ జగిత్యాల**

గొల్లపెల్లి మండలం భీమ్ రాజు పల్లి గ్రామంలో ఎండపెల్లి మండలం సూరారం గ్రామంలో నిర్వహించిన భూముల రీ – సర్వే అవగాహన సదస్సు (గ్రామ సభ )లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత రీ – సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ– సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లు, సర్వేయర్ లు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

# 25న కరీమాబాదులో బీరన్న బోనాల పండుగ..



**ప్రత్యక్ష సాక్షి రంగసాయిపేట**

వరంగల్ నగరం లో గల కరీమాబాదులోని శ్రీ బిరన్న స్వామి దేవస్థానంలో ఈనెల జులై 25న తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కరిమాబాదులో కురుమ కులస్తులు బీరన్న బోనాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కోరే సదానందం మరియు కోరె నాగరాజు తెలిపారు. బుధవారం బీరన్న కుంటలోని భీరన్న స్వామి ఆలయంలో బుధవారం రోజున కోరే కృష్ణ అధ్యక్షతన పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరే సదానందం మరియు కోరే నాగరాజు మాట్లాడుతూ ఈనెల 25న ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పట్టు వస్త్రాలు మరియు జాతీయ జెండాను చేత భూనీ పురవీధుల గుండా తిరుగుతూ ఆలయానికి చేరుకొని ఆలయంలోని చెట్టుపై జాతీయ జెండాను కడతామన్నారు అనంతరం మధ్య 2 గంటల సమయంలో నెత్తిన బోనాలతో దారి పొడవున బీరన్నల విన్యాసాలతో బోనాలు సాగుతాయన్నారు. బోనాలన్నీ కరీమాబాదులోని బురుజు సెంటర్లోకి రాగానే గావుపట్టే కార్యక్రమం ఉంటుందన్నారు గావును తిలకించేందుకు వందలాదిమంది ప్రజలు అక్కడకు వస్తారన్నారు అనంతరం గావు పట్టిన గొర్రెపిల్లను దాటుతూ మహిళలు ఆలయానికి చేరుకుంటారన్నారు ఆలయంలో బీరన్న కామరతుల కళ్యాణం నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించి ఇంటికి వెళ్తామన్నారు ప్రతి ఏటా అందరి సహకారంతో బోనాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నరు ఈ ఏడాది సైతం అందరూ సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పల్లం రవి మరియు మరుపల్ల రవి కురుమ కులస్తులు పాల్గొన్నారు .

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలి : కలెక్టర్ బి. సత్యప్రసాద్



**కుమారస్వామి ప్రత్యక్ష సాక్షి స్టాఫ్ రిపోర్టు జగిత్యాల**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో ఇంటింట నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయగా, ఫారాలను కూడా ఈ ఆగష్టు 3వ తేదీలోపు సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని ప్రజలను కోరారు. ప్రజలకు ఫారాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బీఎల్ఓలను లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందించేందుకు ఎన్నికల సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఫారాల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

కొంతమంది ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నివసించడం లేదని, వేరే ప్రాంతాలకు మారారని లేదా ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నారని బీఎల్ఓల ద్వారా సమాచారం అందుతోందన్నారు. అలాంటి వారు తప్పనిసరిగా సంబంధిత ఫారాన్ని పూర్తి చేసి తమ ప్రస్తుత వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.

వేరే ప్రాంతంలో ఓటు ఉన్నట్లయితే ఆ వివరాలను ఫారంలో పేర్కొనడం ద్వారా అవసరమైన మార్పులు చేసి సరైన నియోజకవర్గంలో ఓటు కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకవేళ ఫారాలు సమర్పించకుండా ఎలాంటి స్పందన ఇవ్వకపోతే, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి అర్హ ఓటరు ఆగష్టు 3వ తేదీలోపు ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓకు అందజేసి, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్ షాదాబ్ హకీం, బి.ఎల్.వో లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల డిగ్రీ కళాశాలలో దాశరథి జయంతి వేడుకలు..

**(ప్రత్యక్ష సాక్షి, కరీంనగర్ టౌన్)**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నగునూరు కరీంనగర్ లో దాశరథి కృష్ణమాచార్య 101వ జయంతి కార్యక్రమాన్ని తెలుగుశాఖ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. టీ మాలతి మాట్లాడుతూ తెలంగాణ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన గలాన్ని కలాన్ని ఎత్తిన యోధుడు దాశరథి అని స్మరించుకున్నారు. వారి ఉద్యమ స్ఫూర్తిని సాహితీకృషిని విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. ఇందూరు జైలులో వేసిన భయపడక ధిక్కార స్వరాన్ని వినిపించాడు. నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని నినాదాన్ని తెలంగాణ అంతటా ప్రచారం చేశారని తెలుగు శాఖ అధ్యక్షులు ఎర్రోజు వెంకటేశ్వర్లు దాశరథి గారి సాహితీ కృషిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని తెలుగు శాఖ తరపున విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించడం జరిగింది.దీనిలో ప్రతిభ కనబరిచిన జి అమూల్య, చిట్టెమ్మ బీకాం సి ఏ తృతీయ సంవత్సరం, శ్రీజ, అంజలి ఫిజికల్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్ .పద్మజ ఏ సి ఓ డా. వసుమతి, తెలుగు శాఖ అధ్యాపకులు డా. సిహెచ్ కవిత, ఏ రేణుక,శంకరయ్య, న్యాక్ కోఆర్డినేటర్ డా. జి. సమత ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి గీతా రాణి తదితరులు పాల్గొన్నారు.



# ఎరుపు రంగు ముల్లంగిని మీరు ఎప్పుడైనా తిన్నారా..?

## దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?

మనకు లభించే అన్ని రకాల కూరగాయల్లోనూ వివిధ వెరైటీలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే ముల్లంగిలోనూ పలు రకాలు ఉంటాయి. మనకు ఎక్కువగా తెలుపు, ఎరుపు రంగులో ఉండే ముల్లంగి లభిస్తుంది. సాధారణంగా చాలా మంది తెలుపు రంగు ముల్లంగినే తింటారు. కానీ ఎరుపు రంగు ముల్లంగి వల్ల కూడా మనకు అనేక లాభాలు కలుగుతాయి. ఈ ముల్లంగిలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. ఎరుపు రంగు ముల్లంగిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందుకనే అవి ఎరుపు రంగులో ఉంటాయి. కనుక ఈ ముల్లంగిని ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. ఎరుపు రంగు ముల్లంగిలో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. కనుకనే అవి ఆ రంగులో మనకు దర్శనమిస్తాయి. ఇవి శరీరాన్ని ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి రక్షిస్తాయి.

**రోగ నిరోధక వ్యవస్థకు..:** ఎరుపు రంగు ముల్లంగిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని దూరం చేస్తాయి. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఎరుపు రంగు ముల్లంగిలో విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. విటమిన్ సి వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. ఫలితంగా సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే విటమిన్ సి సహాయంతో శరీరం కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మాన్ని సంరక్షిస్తుంది. విటమిన్ సి వల్ల మనం తిన్న ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. మహిళలకు ఎంతగానో మేలు జరుగుతుంది.

**జీర్ణ వ్యవస్థకు..:** ఎరుపు రంగు ముల్లంగిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్దకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ ముల్లంగిలో అధికంగా ఉండే నీటి శాతం వల్ల శరీరంలో ఉన్న వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. ఈ ముల్లంగిలో అధికంగా ఉండే నీటి వల్ల దీన్ని తింటే శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి.

జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడతాయి. మెటబాలిజం మెరుగు పడుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఎరుపు రంగు ముల్లంగి కిడ్నీలు, లివర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఆయా అవయవాలు డిటాక్స్ అవుతాయి. వాటిల్లో ఉండే టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. దీంతో లివర్, కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. మూత్రం ధారాళంగా, సాఫీగా జారీ అవుతుంది. మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు, మూత్ర సంబంధిత సమస్యలు తగ్గుతాయి.

**బరువు తగ్గేందుకు..:** ఎరుపు రంగు ముల్లంగిలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్నవారు ఎరుపు రంగు ముల్లంగిని రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. ఈ ముల్లంగిలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీని నియంత్రిస్తుంది. శరీరంలో సోడియం స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. దీని వల్ల హైబీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇలా ఎరుపు రంగు ముల్లంగిని తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. దీన్ని నేరుగా లేదా ఉడకబెట్టి ఎలా తిన్నా సరే లాభాలు కలుగుతాయి.

# ఆదుకునే అత్యవసర నిధి!




డబ్బు అవసరం.. ఎప్పుడు, ఎలా వస్తుందో తెలియదు. వచ్చిన జీతం.. తిండి, ఇంటి కిరాయి, పిల్లల ఖర్చులకే సరిపోతుంది. ముఖ్యంగా మధ్య తరగతి జీవితాలన్నీ.. ఈఎంఐల చుట్టే తిరుగుతున్నాయి. ఇలాంటి సందర్భంలో అనుకోని సంఘటన ఎదురైతే 'అప్పు' తప్ప మరే దారీ కనిపించదు. ఆ అప్పు పుట్టాలన్నా.. నానా తిప్పలు పడాల్సిందే! అందుకే.. ప్రతి కుటుంబం తమ ఆదాయం నుంచే అత్యవసర నిధి (ఎమర్జెన్సీ ఫండ్)ను ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడే.. అనుకోని సమస్య ఎదురైనా, ధైర్యంగా బయటపడొచ్చు.

లక్ష్యం పెట్టుకోవాలి : అత్యవసర నిధి కోసం ఎంత డబ్బు కావాలో ముందే లక్ష్యంగా పెట్టుకోవాలి. అలాగే ఎన్ని నెలల్లో దాన్ని సమకూర్చుకోవాలో కూడా ముందే నిర్ణయించుకోవాలి.

బ్యాంకు అకౌంట్ : ఈ అత్యవసర నిధి కోసమే ప్రత్యేకంగా ఒక బ్యాంకు అకౌంట్ తెరవాలి. ఆ అకౌంట్‌ను పేమెంట్ యాప్స్‌తో లింక్ చేయకూడదు. ఎందుకంటే.. ఆ అకౌంట్‌ను తరచూ చెక్ చేస్తుంటే, డబ్బులు విత్ డ్రా చేయాలనిపించే అవకాశం ఉంటుంది.

ఆటోమేటిక్ ట్రాన్స్‌ఫర్స్ : సాలరీ అకౌంట్ నుంచి అత్యవసర నిధికి చెందిన అకౌంట్లోకి నెలనెలా ఆటోమేటిక్‌గా డబ్బు వెళ్లేలా ఏర్పాటుచేసుకోవాలి. అప్పుడు ప్రతినెలా గుర్తు పెట్టుకుని.. అకౌంట్లో డబ్బు వేయాల్సిన పని ఉండదు.

తెలివైన వాడకం: అనుకున్నంత అత్యవసర నిధి జమయ్యాక.. ప్రతి చిన్న విషయానికీ దానిని ఖర్చు చేయకూడదు. వైద్యపరమైన సమస్యలు, ఉద్యోగసమస్యలు ఉన్నప్పుడు మాత్రమేఉపయోగించాలి. అంతే తప్ప.నెలనెలా వచ్చే ఖర్చుకోసం వీటినిఎట్టిపరిస్థితుల్లోనూ వాడకూడదు.



### ఈ పండ్లు మీకు బయట ఎక్కడ కనిపించినా సరే విడిచి పెట్టకుండా

# తెచ్చుకుని తినండి..

పండ్లంటే చాలా వరకు తియ్యగానే ఉంటాయి. అవి తియ్యగా ఉంటాయి కాబట్టే వాటిని తినేందుకు ఎంతో మంది ఆసక్తిని చూపిస్తుంటారు. అయితే కొన్ని రకాల పండ్లు అంత తియ్యగా లేకున్నప్పటికీ పోషకాలను మాత్రం అధికంగా అందిస్తాయి. అలాంటి పండ్లలో బేరి పండ్లు కూడా ఒకటి. వీటినే ఆంగ్లంలో పియర్ పండ్లు అని కూడా పిలుస్తారు. వీటిల్లో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. బేరి పండ్లు లేత ఆకుపచ్చ లేదా పసుపు రంగులో ఉంటాయి. లోపల తెల్లని గుజ్జు ఉంటుంది. ఇది అంత తియ్యగా ఉండదు. కానీ బోలెడు లాభాలను మాత్రం అందిస్తుంది. ఈ పండ్లలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇవి మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి. పలు వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి.

**జీర్ణ సమస్యలకు..:** పియర్ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఒక మీడియం సైజ్ పియర్ పండును తింటే సుమారుగా 6 గ్రాముల మేర ఫైబర్ లభిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధికంగా బరువు ఉన్నవారు పియర్ పండ్లను తరచూ తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఈ పండ్లు ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. అంటే వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. పియర్ పండ్లలో ఫ్లేవనాయిడ్స్, ఆంథో సయనిన్స్, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**కొలెస్ట్రాల్ సమస్యకు..:** పియర్ పండ్లలో ఉండే ఫైబర్ మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు ఈ పండ్లను రోజూ తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. పియర్ పండ్లు కాస్త తియ్యగానే ఉంటాయి. అయినప్పటికీ ఇవి తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ విలువను కలిగి ఉంటాయి. అందవల్ల ఈ పండ్లను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్ ను తగ్గించడంలో సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

**చర్మ సంరక్షణకు..:** పియర్ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. దీని వల్ల చర్మానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. చర్మం తన సాగే గుణాన్ని పొందుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. మృదువుగా మారి తేమగా ఉంటుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. పియర్ పండ్లలో ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి కనుక ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ సమ్మేళనాలుగా కూడా పనిచేస్తాయి. దీని వల్ల శరీరంలో ఉండే వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. పియర్ పండ్లను కొందరు తొక్క తీసి తింటారు. కానీఈ పండ్లను తొక్కతో సహా తినాల్సి ఉంటుంది. పియర్ పండ్ల తొక్కలోనూ అనేక పోషకాలు ఉంటాయి. కనుక ఈ పండ్లను తొక్కతో తింటే ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయి. ఇలా పియర్ పండ్లను తరచూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# క్షేమంగా వెళ్లిరండి..!



**వానాకాలం ప్రయాణాలు.. కొందరికి ఉత్సాహాన్ని అందిస్తాయి. మరికొందరిని అనారోగ్యాల బారిన పడేస్తాయి. మరీ ముఖ్యంగా.. గర్భిణులను మరింత ఇబ్బంది పెడుతాయి. ఈ సమయంలో వాళ్లు అత్యంత జాగ్రత్తగా మెలగాలని గైనకాలజిస్టులు సూచిస్తున్నారు. ప్రయాణాలు సాఫీగా సాగాలంటే.. కింది జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.**

డాక్టర్ సలహా మేరకు: గర్భిణులు ప్రయాణాలు చేసేముందు గైనకాలజిస్టును కలవడం తప్పనిసరి. మొదటి, చివరి త్రైమాసికంలో ప్రయాణాలను విరమించుకోవడమే ఉత్తమం. గర్భధారణ సమస్యలు ఉన్నప్పుడు ప్రయాణాలు రద్దు చేసుకోవాలి. గర్భిణులు ఎక్కడికి వెళ్లినా మెడికల్ రిపోర్టులు, అత్యవసర ఫోన్ నంబర్లను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలి.

సరైన రవాణా: వానాకాలంలో రైళ్లు, బస్సుల్లో ప్రయాణించడం ఇబ్బందికరం. విమానంలో ప్రయాణించేటప్పుడు ఎయిర్‌లైన్స్ నిబంధనలను తప్పకుండా తెలుసుకోవాలి. గర్భం దాల్చిన 36 వారాల తరువాత విమానంలో ప్రయాణించకపోవడమే మంచిది. సొంత వాహనాల్లో వెళ్లడమే సురక్షితం.


ముందే తెలుసుకోండి: ప్రయాణాలకు సిద్ధమయ్యే ముందే.. వాతావరణ పరిస్థితులను తెలుసుకోండి. వెదర్ యాప్స్, వెబ్‌సైట్లను పరిశీలించండి. భారీ వర్ష సూచనలు ఉన్నప్పుడు ప్రయాణం వాయిదా వేసుకోవడమే మంచిది.

సౌకర్యంగా ఉండండి: వదులుగా ఉండే కాటన్ దుస్తులు వేసుకోవడం వల్ల.. ప్రయాణాల్లో సౌకర్యవంతంగా ఉంటుంది. వాటర్‌ప్రూఫ్ జాకెట్లు, గొడుగు కూడా వెంట ఉంచుకోవాలి. తడిగా ఉన్న చోట జారి కిందపడిపోకుండా.. యాంటి స్లిప్ చెప్పులు వాడండి.

శుభ్రత పాటించాల్సిందే: వానాకాలంలో ఎక్కువగా మూత్రాశయ ఇన్ఫెక్షన్లు, జీర్ణ సంబంధ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే, పరిశుభ్రత తప్పకుండాపాటించాలి. చేతులుశుభ్రం చేసుకోవడానికి శానిటైజర్లు, టవల్స్, టిష్యూలు, టాయిలెట్ సీట్ డిస్ ఇన్‌ఫెక్టెంట్ స్ప్రే వెంట ఉంచుకోండి. పబ్లిక్ టాయిలెట్లకు వీలైనంత దూరంగా ఉండండి.

సమతుల ఆహారం: వానాకాలంలో బయటి ఆహారం తినకపోవడం మంచిది. ముందుగానే కోసి పెట్టుకున్న పండ్లు, సలాడ్లు, మూతలేకుండా ఉంచిన ఆహారం తినడం మంచిది కాదు. నూనె, మసాలాలు, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తింటే.. లేనిపోని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఛాతీలో మంట, అజీర్ణం వంటివి ఇబ్బంది పెడతాయి. పరిశుభ్రమైన వాతావరణంలో చేసిన ఆహారాన్ని మాత్రమే తీసుకోండి.

# అందం కోసం.. అవి వాడొద్దు



ఆడవాళ్లు అందానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. అందునా.. ముఖ వర్చస్సుకు మెరుగులు దిద్దుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఇందుకోసం నానా రకాల సౌందర్య ఉత్పత్తులను ఆశ్రయిస్తుంటారు. కొందరు బ్యూటీ పార్లర్లకు క్యూ కడితే.. మరికొందరు ఇంటి చిట్కాలతోనే సరిపెట్టుకుంటారు. అయితే, కొన్ని సందర్భాల్లో తెలిసీతెలియకుండానే చిన్నచిన్న తప్పులు చేస్తుంటారు. ఏది పడితే అది ఇష్టారాజ్యంగా వాడేస్తుంటారు. అలా అందాన్ని చేతులారా పాడు చేసుకుంటారు. అలా కావొద్దంటే.. కొన్నిటిని పక్కన పెట్టేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

వ్యాక్స్‌తో జాగ్రత్త!: ముఖంపై అవాంఛిత రోమాల్ని తొలగించుకోవడానికి చాలామంది 'వ్యాక్స్'ను ఆశ్రయిస్తారు. అయితే, సరైనదాన్ని ఎంచుకోవడంలో పొరపాటు పడుతుంటారు. మహిళల చర్మతత్వాన్ని బట్టి 'వ్యాక్స్'ను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సున్నిత చర్మం ఉండేవారు.. కఠినమైన వ్యాక్స్‌ను వాడటం వల్ల ముఖ వర్చస్సు దెబ్బతింటుంది. ముఖంపై దద్దుర్లు రావడం, ఎర్రగా మారడం, ముడతలు పడటం లాంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి ఫేషియల్ వ్యాక్స్ వేసుకునే ముందు.. ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవాలని చెబుతున్నారు.

నిమ్మ.. అలా వద్దు!: ఆరోగ్యంతోపాటు అందాన్ని కాపాడటంలోనూ 'నిమ్మ పండు' ముందుంటుంది. అయితే, చాలామంది దీనిని నేరుగా ముఖంపైనే అప్లయి చేస్తుంటారు. ఇలా చేయడం చాలా ప్రమాదకరం. నిమ్మకాయలో ఉండే అధిక ఆమ్లత్వం.. చర్మానికి హాని కలిగిస్తుంది. ముఖం ఎర్రబడటం, చికాకు, దురద లాంటి సమస్యలు తలెత్తుతాయి. అందులోనూ సున్నితమైన చర్మం, మొటిమలు ఎక్కువగా ఉన్నవాళ్లు.. నిమ్మకాయను నేరుగా వాడటం ఏమాత్రం మంచిది కాదు. దానికి బదులుగా తేనె, చక్కెర, నీటితో కలిపి నిమ్మకాయను చాలా తక్కువ మొత్తంలో వాడాలి. నిమ్మకు బదులుగా బంగాళాదుంప, టమాటా వంటివి ఎంచుకుంటే మరీ మంచిది.


అది బాడీ కోసమే..: చర్మానికి తేమను అందించే 'బాడీ లోషన్'ను.. చాలా మంది ముఖానికి వాడుతుంటారు. దీనివల్ల ముఖం జిడ్డుగా మారుతుంది. బాడీ లోషన్‌లోని జిడ్డుదనం.. ముఖ చర్మ రంధ్రాల్లోకి చేరి మొటిమలు రావడానికి కారణం అవుతుంది. బాడీ లోషన్‌లో వాడే రసాయనాలతో చర్మంపై అలర్జీలు వస్తాయి. కాబట్టి, బాడీ లోషన్‌ను కాళ్లు, చేతులు ఇతర శరీర భాగాలకు మాత్రమే అప్లయి చేసుకోవాలి. ముఖం కోసం.. ఫేషియల్ బ్యూటీ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

# స్నానాల గదే.. స్పా!



ఇంటి అలంకరణ అంటే ఫర్నిచర్, గృహాలంకారాలు, గృహోపకరణాలే కాదు.. బాత్రూమ్ అలంకారం కూడా! ఇంటి నిర్మాణంలో ఓ మూలన స్నానాల గదిని కట్టేస్తున్నారు. దాని అలంకరణ గురించి పెద్దగా పట్టింపు కూడా ఉండట్లేదు. కానీ, బాత్రూమ్ అలంకరణపై దృష్టిపెడితే 'స్పా' అంత అందంగా మార్చుకోవచ్చు. గోడలకు అందమైన డిజైన్లు, మూలల్లో, షెల్ఫ్‌ల్లో ఇండోర్ ప్లాంట్స్ పెంచుకుంటే.. స్నానాల గది ఆహ్లాదకరంగా మారిపోతుంది. బాత్రూమ్‌లో తేమ ఎక్కువగా ఉంటుంది. ఈ తేమ వల్ల వెంటిలేటర్లు, డోర్లు, టైల్స్, ట్యాప్‌లపై ఫంగస్, బ్యాక్టీరియా ఎక్కువగా పెరుగుతుంది. వీటి వల్ల దుర్వాసన వస్తుంది. ఈ సమస్యలు రాకుండా కొన్నిరకాల మొక్కలు పెంచుకుంటే.. తేమ నియంత్రణలో ఉంటుంది. గదిలోనూ సువాసన వ్యాపిస్తుంది. గాలిలో ఉండే తేమను గ్రహించి పెరిగేందుకు ఆర్కిడ్స్ అనువైనవి. వీటికి తక్కువ బరువు ఉండే పూలు పూస్తాయి. వెంటిలేటర్లు, షెల్ఫ్‌లో వీటిని సులభంగా పెంచుకోవచ్చు. బోస్టన్ ఫెర్న్‌ని ఎంచుకుంటే ఎక్కువ తేమను గ్రహిస్తాయి. తక్కువ వెలుతురు ఉండేచోట స్నేక్ ప్లాంట్ బాగా పెరుగుతుంది. పీస్ లిల్లీలు.. గాలిలో ఉండే కాలుష్యాన్ని ఎక్కువ మొత్తంలో గ్రహిస్తాయి. పెద్ద ఆకులతో ఆకర్షణీయంగా ఉంటాయి. తక్కువ వెలుతురులోనూ సులభంగా పెరుగుతాయి. బాత్రూమ్‌లో ఎక్కువ తేమను గ్రహిస్తాయి.

# మునగతో జుట్టుకు మేలు!



భారతీయ సూపర్ ఫుడ్‌లలో మునగది ప్రత్యేక స్థానం. మునగాకుతో పప్పు, కాయలతో సాంబార్, కూరలు పసందుగా వండుకుంటారు. రుచిలో తనకు సాటి లేదనిపించే మునగ ఆరోగ్యాన్ని అందించడంలోనూ మేటి అనిపించుకుంది. మన జుట్టు పెరుగుదలకు మునగ ఔషధంలా పనిచేస్తుంది. మునగాకును పొడిగా గానీ, కషాయంగా గానీతీసుకుంటే.. జుట్టుకు పోషకాలు పుష్కలంగా అందుతాయి. జుట్టు పెరుగుదలకు మునగలో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి, జింక్ ఎంతగానో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఉదయం తాగే వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ మునగ పొడిని జోడించండి. మరింత హైడ్రేటింగ్‌గా కావాలంటే మునగ రసాన్ని ఎంచుకోవడం ఉత్తమం. దీనిని తాజా మునగ ఆకులతో చేసుకోవచ్చు. అందులో కాస్త తేనె, ఉసిరి రసం కలుపుకొని తాగితే టేస్టీగా ఉంటుంది. మునగాకు జ్యూస్ యాంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాలను కలిగిఉంటుంది. దీన్నితాగడం వల్ల శరీరంలోని ట్యాక్సిన్లు తొలగిపోతాయి.ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు జుట్టు పెరుగుదలలో కూడా మెరుగైన ఫలితాలనిస్తుంది.

# లీనీట్ పేపర్ లీకేజీతో మనస్థాపానికి గురై మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి..



**ప్రత్యక్ష సాక్షి కరీంనగర్ టౌన్**

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘట న దేశవ్యాప్తంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందని బీసీ సంఘం జిల్లా నాయ కులు దొగ్గలి శ్రీధర్ బుధ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటన కార ణంగా మనస్థాపానికి గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా, సోనమ్ వాంగ్‌చుక్ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొనసాగు తున్న నిరాహార దీక్షలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, వారి డిమాండ్స్ పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని దొగ్గలి శ్రీధర్ అన్నారు.

# హనుమకొండకు రూ.56 కోట్ల అభివృద్ధి వరాలు

## విద్యుత్ రంగంలో మౌలిక వసతుల విస్తరణకు శ్రీకారం చుట్టిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క





**సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్**

తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమై న, నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్య క్రమాల్లో భాగంగా హనుమ కొండలో రూ. 56 కోట్ల వ్యయం తో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి,ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ప్రారంభో త్సవాలు,శంకుస్థా పనలు చేశారు.రాష్ట్ర అటవీ, పర్యావ రణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి హనుమ కొండ నక్కలగుట్టలోని టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం -- విద్యుత్ భవన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి కాలనీ, ఆర్ అండ్ బీ క్వార్టర్స్, విద్యుత్ నగర్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలకు, హనుమకొండ నూతన సర్కిల్ కార్యాలయ భవనానికి, అలాగే టీజీఎన్‌పీ డీసీఎల్ కార్పొరేట్ కార్యాల యం ఐదో అంతస్తు నిర్మాణా నికి శంకుస్థాపన చేశారు. అనంతరం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నూత నంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని, టీజీఎన్‌పీ.. ఈ అభివృద్ధి పనుల ద్వారా హనుమకొండ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సామర్థ్యం గణనీ యంగా పెరగడంతో పాటు, వోల్టేజ్ సమస్యలు తగ్గి, విద్యుత్ అంతరాయాలు నివారించబడతాయి.

వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణను విద్యుత్ రంగం లో దేశానికి ఆదర్శంగా నిలిపే దిశగా ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతోం దని, విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతు న్నామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందిం చడం, పరిశ్ర మలు, వాణిజ్య రంగం, గృహ అవసరాలకు ఎలాంటి అంత రాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# ప్రతిఇంటా ఇంకుడుగుంత నిర్మించాలి..

## ఇంకుడు గుంతలకు ముగ్గు పోసిన ఆర్డిఓ రఘువరన్

**డి సుధాకర్ ప్రత్యక్ష సాక్షి మెట్‌పల్లి టౌన్**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం వెల్లుల్ల గ్రామపంచాయతీలో ఆర్డిఓ రఘువరన్ జలసిరిలో భాగంగా బుధవారం గ్రామపంచాయతీ పనులను చేయడం జరిగింది మ్యాజిక్స్ ఇంటింటి ఇంకుడు గుంతలకు ముగ్గు పోవడం జరిగింది అలాగే ఇంటర్నల్ రోడ్ల వెంబటి ప్లాంటేషన్ సంబంధించి మరియు ఇంటింటి మొక్కల పంపిణీ కూడా చేయడం జరిగింది.. గ్రామపంచాయతీలో కూడా మీటింగ్ తీసుకోవడం జరిగింద. దీనికి సర్పంచ్ గూడూరు తిరుపతి. కార్యదర్శి నారాయణ ఎంపీడీవో మహేందర్.సార్ ఈసీ ఏపీవో సార్ టెక్నికల్ అసిస్టెంట్ సుమన్ ఈసీ ఇజిఎస్ లక్ష్మయ్య. వార్డ్ మెంబర్స్ ,భూమేష్ ముబీన్ వందన సువర్ణ ఐకేపీ మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది



అలాగే డి ఆర్ డి ఓ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఫీల్డ్ అసిస్టెంట్లకు మరియు మేట్లకు మీటింగ్ తీసుకో జరిగింది జలసిరి అంశాల గురించి అలాగే వాటర్ కన్జర్వేషన్ పనుల గురించి పూర్తిగా వివరించి తెలియపరచడం జరిగింది.

# రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీని అక్రమ అరెస్టులతోటే కాంగ్రెస్ పార్టీని అడ్డుకోలేరు : కాంగ్రెస్



**పల్లె సమ్మయ్య ప్రత్యక్ష సాక్షి మందమర్రి**

మందమర్రి దేశ రాజధాని ఢిల్లీలో యువతపై మహిళలపై లాఠీ ఛార్జ్ కు నిరసనగా శాంతియుతంగా ధర్నా చేస్తున్న లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం ఎంపీ గడ్డం వంశీకృష్ణ తో పాటు మిగతా ఎంపీల పట్ల దురుసుగా వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వ బిజెపి వైఖరికి నిరసనగా నిరసన తెలుపుతూ బుధవారం నాడు పట్టణంలో అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు..

మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, అఖిలభారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బండి సదానందం యాదవ్, మాట్లాడుతూ అక్రమ అరెస్టులతోటి కాంగ్రెస్ పార్టీని ఆపలేరని కేంద్రంలో బిజెపి అక్రమంగా ఓటు చోరీ పాల్పడుతూ ఒక నియంత లాగా పాలిస్తూ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని వారు మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్,జనరల్ సెక్రెటరీ పుల్లూరి లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీ గోపతి బానేష్, పట్టణ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు హాజరైన మాజీ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి..



**పల్లె సమ్మయ్య ప్రత్యక్ష సాక్షి మందమర్రి**

మందమర్రి, వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారంనాడు పట్టణంలోని రెండో జోన్ 13వ వార్డు లో పోచమ్మ ఆలయంలో పోచమ్మ తల్లికి అభిషేకం, ఓడి బియ్యం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గుడిలో భక్తుల సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో మహిళలు, స్థానిక ప్రజలు, వెలుగు సమాఖ్య సభ్యులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# కేటీఆర్‌కు 'ఎల్ నినో'పై కనీస అవగాహన లేదు..

## బీఆర్ఎస్ నిర్మించిన మేడిగడ్డ మూడేళ్లకే ఎందుకు కుంగింది?

## హరీశ్‌రావును సమాధానం చెప్పాలని డిమాండ్ చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్**

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన "కాలం తెచ్చిన కరువు కాదు... కాంగ్రెస్ తెచ్చిన కరువు" వ్యాఖ్యలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండిం చారు. ప్రపంచ వాతావరణ మార్పులు,ఎల్ నినో ప్రభావంపై కనీస అవగాహన లేకుండా కేటీఆర్ మాట్లాడటం బాధ్యతా రాహిత్యమని మండిపడ్డారు. అమెరికాలో చదువుకున్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానిం చారు. హనుమకొండలోని ఎన్పీడీసీ ఎల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్ నినో ప్రభావం వల్లే ప్రపంచం లోని అనేక దేశాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నా యని శాస్త్రవేత్తలు స్పష్టంగా చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు.తెలంగాణకు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ప్రకృతి పరిణామా లకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలా బాధ్యులను చేస్తారు? ముఖ్య మంత్రి అక్కడికి వెళ్లి ఏదైనా చేశారా? కనీస శాస్త్రీయ అవగాహన లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లా డటం కేటీఆర్ స్థాయికి తగదు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మక సూచనలు చేస్తే ప్రభుత్వం స్వాగతిస్తుంది. కానీ ప్రజలను తప్పుదారి పట్టించే విష ప్రచారానికి పాల్పడితే ప్రజలే తగిన సమాధానం చెబుతారు" అని భట్టి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అక్రమంగా కూడబెట్టిన సొమ్ముతో ఏర్పాటు చేసుకున్న కొన్ని పత్రికలు, టెలివిజన్ ఛానళ్ల ద్వారా ప్రభుత్వంపై నిరాధార ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అబద్ధా లతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాజీ నీటిపారు దల శాఖ మంత్రి హరీశ్ రావును ఉద్దేశించి భట్టి విక్రమార్క పలు ప్రశ్నలు సంధించారు.



"లక్ష కోట్ల రూపాయలతో నిర్మించామని గొప్పలు చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కేవలం మూడేళ్లకే ఎందుకు కుంగిపోయింది? దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయక త్వంపై ఉంది" అని నిలదీశా రు.కాళేశ్వరం కంటే ఎగువన కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 20 టీఎంసీల సామర్థ్యంతో నేటికీ సురక్షితంగా నిలిచి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తోం దని చెప్పారు. అలాగే ఆరు దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) కూడా గోదావరి వరదల్ని సమర్థంగా తట్టుకుని ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉందని గుర్తు చేశారు.అదే గోదావరి నది... అదే ఇసుక పునాది... కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తుంటే, బీఆర్ఎస్ నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ మాత్రం మూడేళ్లకే ఎందుకు కుంగిపోయిందో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి" అని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమా వేశంలో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ ధర్మపురి స్వరూప వదిలిన స్థలంలో పార్క్ చేయాలని కమిషనర్ శ్రీనివాస్‌కి వినతి..



**డి సుధాకర్ ప్రత్యక్ష సాక్షి మెట్‌పల్లి టౌన్**

జగిత్యాల జిల్లా మెట్ పల్లిహాబుధవారం పట్టణంలోనిహా7 వార్డులో ఉన్న లేఅవుట్ ఓపెన్ ప్లేస్ లో లెక్చరర్ బీర్కూర్ చంద్రయ్యహాహావారి స్థలంలో లేఔట్ లో ప్రజల ఉపయోగం కొరకు వదిలిన స్థలంలో ఉన్న ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ తొలగించి ఓపెన్ జిమ్ అండ్ పార్క్ చేయాలని కమిషనర్ శ్రీనివాస్‌హాకి వార్డు కౌన్సిలర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్‌హాహావినతి పత్రం ఇచ్చారు ఈ సందర్భంగా కౌన్సిలర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్ మాట్లాడుతూ వార్డు లో ఉన్న స్థలాన్ని వార్డు మరియు పట్టణ వాసులకు ఉ పయోగకరంగా ఉండేందుకు జిమ్ము ఏర్పాటు చేయాలని ఇక్కడ స్థలము వృధా చెత్త చెదారంతో నిండి పోయిందని నిరుపయోగ్యంగా ఉందని కావున దీనిని ప్రజలకు జిమ్ము అవసరం ఏర్పాటు చేయాలని కోరామని అన్నారు.

# ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**కుమారస్వామి ప్రత్యక్ష సాక్షి స్టాఫ్ రిపోర్టు జగిత్యాల**

జగిత్యాల జిల్లా రూరల్ మండలంలోని బుధవారం.పలు గ్రామాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గుల్లపేట గ్రామంలో గ్రామపంచాయతీ భవనం నిర్మాణ పనులను, అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను తనిఖీ చేశారు. భవన నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాలతో చేపట్టాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా అన్ని సౌకర్యాలతో పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.


అనంతరం లక్ష్మీపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న పల్లె దవాఖాన నూతన భవనం మరియు వీవో (ూ) భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పల్లె దావఖానా భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీవో భవనాలను అన్ని మౌలిక వసతులతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని. ప్రజల



అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న ప్రతి ప్రభుత్వ భవనం దీర్ఘకాలం ఉపయోగపడేలా నిర్మించాలని, పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్ షాదాబ్ హకీం, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, , స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్‌లో సెల్ఫోన్ పేలి ముఖం ఛిద్రం



**కుదురుపాక పోశం ప్రత్యక్ష సాక్షి స్టాఫ్ రిపోర్టు మంచిర్యాల**

సెల్ఫోన్ పేలి విద్యార్థికి తీవ్ర గాయాలైన ఘటన ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని గూడెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గూడెంకు చెందిన నికాడి లోకేశ్ బుధవారం ఇంట్లో సెల్ఫోన్ చూస్తుండగా అది ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ప్రమాదంలో విద్యార్థి మూతి భాగం తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని స్థానికులు పేర్కొన్నారు

printed,published and owned by Kandukuri Parameshwar Rao, printed at Rimsha printers,. H .no 5-16/1, Algunoor,Mandal Thimmapur, Dist Karimnagar (TS) place of Publication H.NO.1-2-31/4/B/1 krishna nagar jagital dist(TS).cell no.99892 88546, Editor K.Parameshwar rao. RNI No.APTEL/2011/38267. kprao1961@gmail.com